'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

# సల్లవడ్డ ప్రభుత్వం.. తల్లడిల్లె రైతు



గోసుల శ్రీనివాస్‌యాదవ్
98498 16817

**ఇబ్బందుల్లో ఉన్నవారికి తక్షణమే కాస్తయినా సాయం అందితే వారికి ఎంతో సంతృప్తిగా ఉంటుంది. కష్ట సమయాల్లో కాకుండా ఆ తర్వాత చాలా రోజులకు అంతకన్నా ఎక్కువ సాయం చేసినా అది వారికి ఊరట కలిగించదు. అంతగా ఉపయోగపడదు కూడా. రాష్ట్రంలో ప్రస్తుతం రైతులు ఎదుర్కొంటున్న పరిస్థితి ఇలాంటిదే. యాసంగి పంటలు ఎండిపోవడంతో నష్టాలపాలైన రైతన్నలకు ప్రభుత్వ చేయూత కరవైంది. కరవు నెలకొన్నా ప్రభుత్వం నుంచి తక్షణ సాయం అందడం లేదన్నది వారి ఆవేదన. మిగిలిన వాటి మాట ఎలా ఉన్నా కనీసం రైతుబంధు అందినా ఎంతో కొంత ఆసరాగా ఉంటుందని అన్నదాతలు ఆశిస్తున్నారు. ప్రభుత్వం కేవలం ఐదెకరాలలోపు భూములున్న వారికే రైతుబంధు ఇచ్చి చేతులు దులుపుకొన్నది. మిగిలినవారికి మొండిచెయ్యి చూపింది. కనీసం పదెకరాలు ఉన్నవారికైనా పెట్టుబడి సాయం అందించి ఉంటే ఎక్కువమంది అన్నదాతల కష్టం తీరేది. యాసంగి పంటలు ఎండిపోయిన రైతన్నలకు ఇది కొంతమేరకు ఉపశమనంలా ఉండేది.**

ప్రస్తుతం పల్లెల్లో ఎక్కడ చూసినా ఈ అంశం గురించే చర్చ నడుస్తోంది. రైతుబంధు అవసరం గురించి అన్నదాతలు ఇంతగా మాట్లాడుకుంటున్నారంటేనే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. వారి దుస్థితికి గల కారణాలపై కూడా ఆలోచించాల్సిన అవసరం ఉన్నది. గత తొమ్మిదేండ్లుగా లేనిది ఈ ఏడాదే కరవు ఎందుకు వచ్చిందన్న దానిపై పరిశీలన జరిపితే.. అసలు రాష్ట్రంలో ప్రకృతి కారణంగానే కరవు వచ్చిందా? అన్న సందేహం కలుగకమానదు. రాష్ట్ర వ్యవసాయ శాఖ లెక్కలు చూస్తే అలా అనిపించడం లేదు. తగినంతగా వర్షాలు కురిసినా నీటి నిర్వహణలో లోపాల కారణంగానే నేడు రాష్ట్రంలో దుర్భర పరిస్థితి సంభవించిందని చెప్పవచ్చు. గత 30-35 ఏండ్ల సగటు వర్షపాతాన్ని గమనిస్తే.. రాష్ట్రంలో 866.40 మిల్లీమీటర్ల వర్షం కురిస్తే దాన్ని సాధారణ వర్షపాతంగానే భావించాలి. 2023-24లో 914.90 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. చాలా ప్రాంతాల్లో సాధారణ వర్షపాతం కన్నా 5.4 శాతం అధికంగా వర్షాలు కురిసినట్టు లెక్కలు చెప్తున్నాయి. ఈ వర్షాలు పంటల సాగుకు సరిపోతాయి. అంతకుముందు రెండేండ్లలో భారీగా వర్షాలు కురిసిన మాట వాస్తవమే. గతంతో పోల్చి చూసుకొని వానలు తగ్గాయని రైతులు అనుకోవడం సహజమే. సాధారణంగా తెలంగాణలో ఏడాదిలో 120 రోజుల పాటు వర్షాలు పడతాయి. గతేడాది మాత్రం కొద్ది అటూఇటుగా తక్కువ రోజుల పాటు వర్షాలు కురిశాయి. ఆగస్టులో కూడా కొద్ది రోజుల పాటే వానలు పడ్డాయి. అయినప్పటికీ వానలు పడ్డ రోజు భారీగా వర్షపాతం నమోదవడంతో నీటి లభ్యతకు ఇబ్బంది లేకుండాపోయింది. మొత్తం 33 జిల్లాలకు గాను 6 జిల్లాల్లో అత్యధిక వర్షపాతం, 25 జిల్లాల్లో సాధారణ వర్షపాతం, కేవలం రెండు జిల్లాల్లోనే లోటు నమోదైంది. నీటి వనరుల నిర్వహణ బాగుండటంతో చాలా ప్రాంతాల్లో వానకాలం పంటలకు ఎలాంటి ఇబ్బంది కలగలేదు.

మరి యాసంగి పంటలకు వచ్చేసరికి ఎందుకు పరిస్థితి మారిపోయింది? కొత్త ప్రభుత్వం రావడమే అందుకు కారణమా? ఈ విషయాన్ని కూడా రైతులు చర్చించుకుంటున్నారు. నీటి వనరుల నిర్వహణ సరిగ్గా లేకపోవడం తమ దుస్థితికి ప్రధాన కారణమని అన్నదాతలు అనుకుంటున్నారు. కొత్త ప్రభుత్వం నుంచి తగిన సూచనలు, సలహాలు అందకపోవడమే కారణమని వారు భావిస్తున్నారు. గతేడాది యాసంగితో పోల్చితే ఈ ఏడాది వరి సాగు విస్తీర్ణం కనీసం 15-20 శాతం మేర తగ్గిపోయింది. మొత్తంగా చూస్తే సాధారణ వర్షపాతం నమోదై, భూగర్భ జలాలు ఉండి, కరెంటు ఉండి ఎందుకు ఇంత కరవు వచ్చిందన్నదే రైతుల ప్రశ్న. ప్రభుత్వం తగిన విధంగా స్పందించలేదని అన్నదాతలు ఇప్పుడు గ్రహిస్తున్నారు.



ఎన్నికల సందర్భంగా ఊరూరా తిరిగిన నాయకులందరూ క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించినవారే. సమస్యను అవగాహన చేసుకున్నవారే. మరి కరవును అంచనా వేసి తక్షణ సాయాన్ని ఎందుకు ఇవ్వలేకపోయారన్నది అసలు ప్రశ్న. గతంలో తక్కువ వర్షపాతం నమోదైనా కరవును ఎదుర్కొంటున్నామన్న భావన రైతుల్లో కలగలేదు. 2018-19లో 722.6 మిల్లీమీటర్లు, 2017-18లో 814.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అయినా పంటలు ఎండిపోవడం గానీ, రైతులు ఆర్థికంగా నష్టపోవడం గానీ జరగలేదు. కరవు అనే మాటే లేదు. ఇందుకు కారణం తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం అందుబాటులో ఉన్న సాగునీటి వనరులను సక్రమంగా వినియోగించుకోవడమే. అందుకే 'తెలంగాణ మాడల్' అన్నమాట దేశం దృష్టిని ఆకర్షించింది. వ్యవసాయ దిగుబడుల్లో రికార్డు సృష్టించింది. ప్రస్తుతం ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో భూములు బీడుగా ఉండటానికి కారణం గోదావరి జలాలను సద్వినియోగం చేసుకోకపోవడమే. కాళేశ్వరం ప్రాజెక్టులోని కొన్ని లోపాలను బూచిగా చూపించి గోదావరి నీటిని కిందికి వదిలేశారు. కాళేశ్వరం అన్నది ఎత్తిపోతల ప్రాజెక్టు. ఆనకట్ట అవసరం లేకుండానే నదిలోని నీటిని పంపుల ద్వారా నేరుగా ఎత్తిపోసే అవకాశం ఉంది. కొన్ని మోటర్ల ద్వారా అయిన నీటిని నేరుగా ఎత్తిపోసి ఉంటే ఎంతో కొంత పంటకు నీరందేది. ఎంతో సాంకేతిక విజ్ఞానంతో, కోట్లాది రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన మోటర్లను వృథాగా ఉంచే బదులు కొన్నింటినైనా నడిపి ఉంటే కనీసం కొన్ని చెరువులైనా నిండేవి. గోదావరి జలాలను వృథా చేయడంతో జరగాల్సిన అనర్థం జరిగిపోయింది. కొన్ని ప్రాంతాల్లో యాసంగి పంట సాగు చేయనేలేదు. ఇదంతా చూస్తుంటే నీటి నిర్వహణపై ప్రభుత్వం దృష్టి సారించలేదని, కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల పట్ల ఏ మాత్రం చిత్తశుద్ధి లేదని అర్థమవుతున్నది.

రైతుల ఆవేదనకు మరో కారణం మార్కెటింగ్‌లో నెలకొన్న లోపాలు. కాయకష్టం చేసి ధాన్యం పండించిన రైతన్న దాన్ని అమ్ముకోవడానికి నానా తంటాలు పడాల్సి వస్తోంది. మద్దతు ధర ఎంత? ఎప్పుడు కొంటారు? కొన్న తర్వాత సొమ్ము ఎప్పుడిస్తారు? తరుగు, తేమ కింద ఎంత తగ్గిస్తారు? ఇలా ఏ విషయంలోనూ రైతులకు స్పష్టత లేదు. చెప్పేవారు లేరు. వరి సాధారణ రకానికి మద్దతు ధర క్వింటాలుకు రూ.2,183గా ఉంది. అదే ఏ గ్రేడు రకానికి క్వింటాలుకు రూ.2,203గా ప్రభుత్వం ప్రకటించింది. దీనికి తోడు ప్రతి క్వింటాలుకు రూ.500 బోనస్‌గా ఇస్తామని మ్యానిఫెస్టోలో కాంగ్రెస్ ప్రకటించింది. దీనిపైనే రైతులు ఆశలు పెట్టుకున్నారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం దాని ఊసే ఎత్తడం లేదు.

**సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఈ ధర చెల్లించడం లేదు. ఓపెన్ మార్కెట్లో కొన్నిచోట్ల సాధారణ రకం ధాన్యం క్వింటాలుకు రూ.2,200-2,600 వరకు పలుకుతున్నా తగిన సౌకర్యాలు లేకపోవడంతో అమ్ముకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా హామీ ఇచ్చినట్టుగా బోనస్ ఎప్పటి నుంచి ఇస్తారని రైతన్నలు కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులను నిలదీస్తున్నారు.**

నిజామాబాద్, నల్గొండ జిల్లాల్లో ధాన్యం కొనుగోళ్లు కొంతవరకు జరుగుతున్నా మిగిలిన జిల్లాల్లో మాత్రం అంతంతమాత్రంగానే కొనుగోళ్లు సాగుతున్నాయి. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు పడిగాపులు తప్పడం లేదు. ఎన్నికల ప్రచారాల్లో తలమునకలైన ముఖ్యమంత్రి, వ్యవసాయ మంత్రి రైతుల గోసను పట్టించుకోవడం లేదు. కనీసం ప్రభుత్వ అధికారులకు ఆదేశాలు ఇచ్చే పాపాన కూడా పోవడం లేదు. ఒకవేళ ఆదేశాలు ఇచ్చినా అవి అమలయ్యే వరకు నమ్మకం లేని పరిస్థితి నెలకొన్నది. అందుకే చాలాచోట్ల అన్నదాతలు ఆందోళనకు దిగుతున్నారు. కాంగ్రెస్ హామీలను గుర్తుచేస్తూ హరీశ్‌రావు ఆధ్వర్యంలో సిద్దిపేట రైతులు పోస్టుకార్డు ఉద్యమాన్ని ప్రారంభించారు. సిద్దిపేట రైతులను ఆదర్శంగా తీసుకొని రాష్ట్రవ్యాప్తంగా అన్నదాతలందరూ పోస్టుకార్డు ఉద్యమంలో పాల్గొనాలని సంగారెడ్డి ప్రజాసభ వేదికగా ప్రజా నేత కేసీఆర్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలయ్యేలా ఉద్యమం చేయాలని రైతులను కోరారు.

**రుణమాఫీ, రైతు కూలీలకు సాయం వంటి హామీల గురించి ప్రస్తుతం ప్రస్తావించాల్సిన అవసరం లేదు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ప్రభుత్వం ఇప్పుడే వాటి జోలికి పోదని కూడా రైతులకు తెలుసు. ఇన్ని సమస్యలతో రైతులు సమమతం అవుతున్నప్పుడు పదెకరాలు భూములున్న రైతులకు కూడా రైతుబంధు ఇచ్చి ఉంటే ఎంతో ఊరట కలిగి ఉండేది. కౌలు రైతులకు రైతుబంధు వర్తింపజేయడంపైనా నిర్ణయం తీసుకొని ఉంటే బాగుండేది.**

గతంలో పెద్ద రైతుల నుంచి చిన్న రైతులు భూములను కౌలుకు తీసుకునే వారు. ఇప్పుడు చిన్న రైతులే తోటి రైతులకు భూములను కౌలుకు ఇచ్చి పట్టణాలకు వలస వెళ్తున్నారు. భూమి యజమానిది, కౌలు రైతుది ఒకటే పరిస్థితి. ఇద్దరిలో ఎవరికీ నష్టం కలగకుండా ఉభయులకూ లాభం చేకూరేలా నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. దీనిపై ఇప్పటికే రైతులను సంప్రదించి వారి అభిప్రాయాలను తెలుసుకొని మంచిచెడులపై సమీక్ష జరిపి ఉంటే రైతులకు కొంత భరోసా కలిగి ఉండేది. కౌలు రైతులకు రైతుబంధు వర్తింపజేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్న అభిప్రాయం కలిగి ఉండేది. కష్టకాలంలో నాలుగు మంచి మాటలు చెవినపడితే బతుకుకు నిబ్బరం కలుగుతుంది. ఇలాంటి తక్షణ సాయం లేకపోవడం వల్లనే రైతులు అసంతృప్తి చెందుతున్నారు. ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. మరో పక్కన బ్యాంకు వాళ్లు చాలా గ్రామాల్లో రైతుల ఇంటికి వెళ్లి రుణాలు కట్టాలంటూ వేధిస్తున్నారు. ఇప్పటికే కేసీఆర్ రైతులకు భరోసా ఇస్తున్నారు. ఆత్మస్థైర్యం నింపుతున్నారు. 'మీ పంటను కొనిపించే బాధ్యత నాది. మీకు తాగు, సాగు నీరు ఇప్పించే బాధ్యత నాది. మీరు ధైర్యంగా ఉండండి' అని పొలంబాట పట్టి రైతులకు గుండె ధైర్యం ఇస్తున్నారు తెలంగాణ బాపు కేసీఆర్.

ఇప్పటికైనా కాంగ్రెస్ సర్కార్ మొద్దునిద్ర వీడాలి. లేకుంటే గ్రామీణులు, ముఖ్యంగా రైతులు తిరగబడటం ఖాయం. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ఆగ్రహాన్ని తప్పక చవిచూస్తుంది. కాంగ్రెస్ నిజస్వరూపాన్ని గ్రహించిన తెలంగాణ ప్రజలు రేవంత్ సర్కార్‌కు కర్రు కాల్చి వాతపెట్టడం తథ్యం.

**రైతుల ఆవేదనకు మరో కారణం మార్కెటింగ్‌లో నెలకొన్న లోపాలు. కాయకష్టం చేసి ధాన్యం పండించిన రైతన్న దాన్ని అమ్ముకోవడానికి నానా తంటాలు పడాల్సి వస్తోంది. మద్దతు ధర ఎంత? ఎప్పుడు కొంటారు? కొన్న తర్వాత సొమ్ము ఎప్పుడిస్తారు? తరుగు, తేమ కింద ఎంత తగ్గిస్తారు? ఇలా ఏ విషయంలోనూ రైతులకు స్పష్టత లేదు. చెప్పేవారు లేరు. వరి సాధారణ రకానికి మద్దతు ధర క్వింటాలుకు రూ.2,183గా ఉంది. అదే ఏ గ్రేడు రకానికి క్వింటాలుకు రూ.2,203గా ప్రభుత్వం ప్రకటించింది. దీనికి తోడు ప్రతి క్వింటాలుకు రూ.500 బోనస్‌గా ఇస్తామని మ్యానిఫెస్టోలో కాంగ్రెస్ ప్రకటించింది. దీనిపైనే రైతులు ఆశలు పెట్టుకున్నారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం దాని ఊసే ఎత్తడం లేదు.**

(వ్యాసకర్త: బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు)

---

**తెలంగాణ రాష్ట్ర రాజకీయాలు కులాల చుట్టూ తిరుగుతున్నాయా అంటే అవుననే చెప్పవచ్చు. ముఖ్యంగా అధికార కాంగ్రెస్ పార్టీ మాదిగలను విస్మరిస్తున్నది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో మాదిగలపై ప్రేమను ఒలకబోసిన ఆ పార్టీ.. మాదిగ నాయకత్వాన్ని సంపూర్ణంగా వాడుకున్నది. రాష్ట్రంలో 80 లక్షలకు పైగా జనాభాతో అతిపెద్ద సామాజికవర్గమైన మాదిగలను కాంగ్రెస్ సర్కార్ అణగదొక్కాలని చూస్తున్నది. అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలు అందుకు బలం చేకూరుస్తున్నాయి. మరోవైపు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ కూడా ఆ తరహాలోనే వ్యవహరిస్తుండటం గమనార్హం.**

# మాదిగలపై కక్ష సాధింపు



సంపత్ గడ్డం
78933 03516

కాంగ్రెస్ అంటేనే అగ్ర కులాలకు ప్రాతినిధ్యం ఎక్కువగా ఇచ్చే పార్టీ అనే విషయం అందరికీ తెలిసిందే. వారి కనుసన్నల్లో ఆ పార్టీ, కాంగ్రెస్ సర్కార్ నడుస్తున్నాయి. ఇటీవల ప్రకటించిన కార్పొరేషన్ చైర్మన్ల నియామకాలే అందుకు నిదర్శనం. 37 కార్పొరేషన్లలో ఒకే ఒక్క కార్పొరేషన్‌కు మాదిగను చైర్మన్‌ను చేశారు. అది కూడా ఎస్సీ కార్పొరేషన్ కావడం గమనార్హం. సీఎం సొంత సామాజికవర్గానికి దాదాపుగా 14 కార్పొరేషన్లను కట్టబెట్టారంటేనే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఏండ్ల తరబడి పార్టీని నమ్ముకొని పని చేసిన వారిని కాదని.. కొత్తగా పార్టీలో చేరినవారిని అందలం ఎక్కిస్తున్నారు. అందులోనూ మాల ప్రాతినిధ్యమే ఎక్కువగా ఉండటం మాదిగలను తీవ్ర నైరాశ్యానికి గురి చేస్తున్నది. మాదిగల రాజకీయ ఉనికిని ప్రశ్నార్థకం చేయాలన్న ఉద్దేశమే దీని వెనుక ఉన్నట్టు అనిపిస్తున్నది. బలమైన మాదిగ గొంతుకలను నొక్కడం ద్వారా కాంగ్రెస్ అంటేనే రెడ్లు, మాలలు అన్న పేరును సార్థకం చేయాలనే కుట్ర దీని వెనుక దాగి ఉన్నదనే అనుమానాలు కలుగుతున్నాయి.

తెలంగాణలో ప్రస్తుతం ఉపముఖ్యమంత్రిగా మాల సామాజికవర్గానికి చెందిన భట్టి విక్రమార్క ఉన్నారు. ఆయన సోదరుడు మల్లు రవికి నాగర్‌కర్నూల్ ఎంపీ టికెట్‌ను కాంగ్రెస్ కేటాయించింది. వివేక్ వెంకటస్వామి, అతని సోదరుడు వినోద్ ఎమ్మెల్యేలుగా కొనసాగుతున్నారు. అది సరిపోదన్నట్టు.. వివేక్ తనయుడు గడ్డం వంశీకి ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానమైన పెద్దపల్లి టికెట్ ఖరారు చేశారు. ఇలా ఒక్కో కుటుంబం నుంచి ఇద్దరు, ముగ్గురికి రాజకీయ అవకాశాలు కల్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ మాదిగలను అణచివేస్తున్నది. 3 ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానాల్లో కాంగ్రెస్ కనీసం ఒక్కటైనా మాదిగలకు కేటాయించలేదు. దీన్నిబట్టే ఆ పార్టీ మాదిగలపై ఎంతలా కక్ష పెంచుకున్నదో అర్థమవుతున్నది. మాదిగల అండతోనే తాము గెలిచామని చెప్పే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అందుకు విరుద్ధంగా వ్యవహరించడం బాధాకరం. వర్గీకరణకు కట్టుబడి ఉంటామని హామీ ఇచ్చి చివరికి అసలు మాదిగల ప్రాతినిధ్యమే లేకుండా చేయాలనుకోవడం సరికాదు. సామాజిక చైతన్యం కలిగిన మాదిగలు చట్టసభలకు వెళ్లకుండా ఉద్దేశపూర్వకంగా అడ్డుకుంటున్నారనే అనుమానాలున్నాయి. ఇదిలా ఉంటే బీఆర్ఎస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికల్లో సామాజిక కూర్పును పాటించింది. 12 జనరల్ స్థానాల్లో బీసీ అభ్యర్థులను నిలబెట్టింది. పార్లమెంటులో బీసీల గొంతు వినిపించేందుకు కేసీఆర్ మార్గం సుగమం చేశారు. అదీకాకుండా మూడు ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానాలు ఉండగా.. వాటిలో రెండింటిని మాదిగలకు కేటాయించారు.



వాస్తవానికి ఢిల్లీ అధిష్ఠానం వద్ద మాదిగల ఆవేదనను వెలిబుచ్చేవారు కాంగ్రెస్‌లో లేకపోవడమూ దీనికి ఓ కారణమై ఉండొచ్చు. కాంగ్రెస్ పార్టీ మాదిగల పట్ల ఇదే వైఖరిని అవలంబిస్తే రాబోయే రోజుల్లో భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. గత ప్రభుత్వంలో మాదిగలకు సరైన అవకాశాలు దక్కలేదని ఆరోపణలు చేసే కాంగ్రెస్ నేతలు ఇప్పుడు స్పందించాలి. కాంగ్రెస్ పార్టీ అగ్రకులాల వారికి అధిక ప్రాధాన్యం ఇస్తుందనడంలో ఎటువంటి సందేహం లేదు. కార్పొరేషన్ పదవులతో పాటు పార్లమెంట్ స్థానాలు ఇవ్వకపోయినా కనీసం కంటోన్మెంట్ ఉప ఎన్నిక బరిలో మాదిగ అభ్యర్థిని ఉంచుతారని ఆశించినప్పటికీ నిరాశే ఎదురైంది. సీట్ల సంగతి దేవుడెరుగు. మాదిగలను కనీసం పార్టీలో కూడా ఉండనివ్వడం లేదు. మాదిగలను అణగదొక్కే చర్యలకు తెరలేపిన ఆ పార్టీ 34 ఏండ్ల పాటు కాంగ్రెస్ కోసం పనిచేసిన బక్క జడ్సన్‌ను కుట్రలో భాగంగానే బహిష్కరించింది.

రెండు జాతీయ పార్టీల లక్ష్యం ఒక్కటే. ఎన్నికల్లో గెలవడం. దానికోసం ఆ పార్టీల నాయకులు ఎన్ని అబద్ధాలైనా చెప్తారు. నీతిమాటలు మాట్లాడుతూనే అనైతిక రాజకీయాలు చేస్తున్న కాంగ్రెస్, బీజేపీకి పార్లమెంట్ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలి. ఢిల్లీలోని అధిష్ఠానం ఆడించినట్టు ఆటాడేవారి వల్ల తెలంగాణకు ప్రయోజనం శూన్యం. తెలంగాణ కోసం కొట్లాడేది బీఆర్ఎస్సే. ఇప్పటికే ఒకసారి నష్టపోయాం. మరోసారి మోసపోతే గోసపడతాం. జాతీయ పార్టీల కుట్రలను తిప్పికొట్టి.. పార్లమెంట్ ఎన్నికల్లో గులాబీ జెండాను ఎగురవేద్దాం.

---

# కేసీఆర్.. అదే వేగం, అదే చతురత



వి.వి.వెంకటేశ్వరరావు
63008 66637

**రాజకీయ నిర్ణయాల్లో నూతన అంశాలను తెరమీదికి తెస్తూ, వేగంగా పావులు కదపడంలో కేసీఆర్ ముందుంటారు. అందుకే ఇప్పటికే బీఆర్ఎస్ తరఫున లోక్‌సభకు పోటీచేసే అభ్యర్థులను ఖరారు చేసి బీఫామ్స్ కూడా అందజేశారు. నామినేషన్ల పర్వం ప్రారంభమై ఇప్పటికే మూడు రోజులవుతున్నా ఇంకా బీజేపీ, కాంగ్రెస్‌లలో డైలమా కనిపిస్తున్నది.**



తెలంగాణ రాజకీయాల్లో కేసీఆర్ తన మార్క్‌ను ఇప్పటికీ చూపిస్తూనే ఉన్నారు. రెండు ప్రధాన పార్టీలు ఆయన రాజకీయ చతురతతో పోటీ పడలేకపోతున్నాయి. ఆ పార్టీలు జాతీయ పార్టీలు కావడం, నిర్ణయాలు ఢిల్లీలో జరగాల్సి ఉండటంతో తీవ్ర గందరగోళం ఏర్పడుతున్నది. కానీ, కేసీఆర్ ప్రతికూల పరిస్థితుల్లోనూ తమ పార్టీ నేతలను బీజేపీ, కాంగ్రెస్‌లు పంచుకున్నప్పటికీ ఏ మాత్రం ఒత్తిడికి గురికాకుండా అభ్యర్థులను ఖరారు చేసి బీఫామ్స్ కూడా ఇచ్చేశారు. ప్రచారానికి రంగంలోకి దిగాలని నిర్ణయించుకున్నారు. తాజాగా రాష్ట్రంలో బస్సుయాత్రను చేపట్టేందుకు అనుమతి వ్వాల్సిందిగా రాష్ట్ర ఎన్నికల సంఘానికి లేఖ రాశారు. అనుమతి రావడమే ఆలస్యం ఆయన రణరంగంలోకి దూకేందుకు సిద్ధంగా ఉన్నారు.


**అభ్యర్థుల ఎంపికలోనూ కేసీఆర్‌దే పైచేయి:** తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు మూడు నెలల ముందే తన పార్టీ అభ్యర్థులను ప్రకటించిన కేసీఆర్ దేశవ్యాప్తంగా కొత్త రికార్డును సొంతం చేసుకున్నారు. నిజానికి అప్పుడు టిక్కెట్ల కోసం పార్టీ నేతల నుంచి తీవ్ర ఒత్తిడి ఉన్నది. అప్పట్లో అధికార పార్టీ బీఆర్ఎస్ మూడో సారి కూడా అధికారంలోకి వస్తుందన్న బలమైన నమ్మకంతో ఉన్నారు. అయినా అసంతృప్తిని లెక్కచేయకుండా.. 'ఉండేవారు ఉంటారు, పోయేవారు పోతారు' అని అన్ని పార్టీల కంటే ముందే బీఫాంలను అందజేశారు. ఎమ్మెల్యేలపై వ్యతిరేకత ఉన్నదని ప్రచారం జరిగినా తాను చేసిన ప్రకటనకే కట్టుబడి ఉన్నారు. ఈ కారణంగా చాలామంది కీలక నేతలు కాంగ్రెస్ గూటికి చేరారు. అయినా, కేసీఆర్ భయపడలేదు, పట్టించుకోలేదు. లోక్‌సభ ఎన్నికలకు వచ్చేసరికి.. టిక్కెట్ ఇస్తామన్నా కూడా నేతలు వేరే పార్టీలకు వెళ్లిపోయారు. అయినా కేసీఆర్ పోయిన వారి స్థానంలో వెంటనే ప్రత్యామ్నాయాన్ని చూసుకున్నారు. అభ్యర్థులను ఎంపిక చేసి బీఫాంలు మాత్రమే కాదు, అభ్యర్థుల ఎన్నికల ఖర్చుల కోసం రూ.95 లక్షలు కూడా ఇచ్చారు.

**కీలక నేతలు పార్టీని వీడినా పట్టించుకోని గులాబీ బాస్..:** లోక్‌సభ ఎన్నికల టిక్కెట్లు ఇచ్చిన తర్వాత కూడా పలువురు నేతలు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్, బీజేపీలో చేరిపోయారు. వీరిలో కడియం శ్రీహరి, గడ్డం రంజిత్‌రెడ్డి, కే.కేశవరావు వంటి సీనియర్లు కూడా ఉన్నారు. ఖైరతాబాద్, భద్రాచలం ఎమ్మెల్యేలు దానం నాగేందర్, తెల్లం వెంకటరావు, హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ తదితరులు పార్టీని వీడారు. ఇలాంటి సమయంలో పార్టీలో నైరాశ్యం పోగొట్టి, క్యాడర్‌లో నూతనోత్సాహాన్ని నింపేందుకు కేసీఆర్ వివిధ వ్యూహాలు రచించారు.

ఇదిలా ఉంటే రాష్ట్రంలో కాంగ్రెస్ అభ్యర్థుల కసరత్తు దారి తప్పిందన్న అభిప్రాయం వినిపిస్తున్నది. బీజేపీ ఎంపీ అభ్యర్థుల మార్పు అంశం కూడా మరోమారు చర్చనీయాంశం అవుతున్నది. పెద్దపల్లిలో గోమాస శ్రీనివాస్ స్థానంలో సిట్టింగ్ ఎంపీ నేతకాని వెంకటేశ్‌ను బరిలోకి దింపాలని యత్నిస్తున్నది. ఆ దిశగా ఢిల్లీ నాయకత్వం వడివడిగా అడుగులు వేస్తున్నట్టు తెలుస్తున్నది. అభ్యర్థుల ప్రచారంపై నిఘా పెట్టిన నాయకత్వం ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నట్టు ప్రచారం జరుగుతున్నది. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కూడా తన నియోజకవర్గాన్ని, హైదరాబాద్‌ను విడిచి ఎక్కడకు వెళ్లడం లేదు. పెద్దపల్లి నుంచి ఆ పార్టీ తరఫున బరిలో దిగిన శ్రీనివాస్ బలమైన అభ్యర్థి కారనీ, ప్రచారంలోనూ వెనుకబడుతున్నారని అమిత్ షా టీమ్ గుర్తించిందని చెప్తున్నారు. ఈ నేపథ్యంలో పెద్దపల్లి అభ్యర్థి మార్పుపై రెండు, మూడు రోజుల్లో మరింత క్లారిటీ వచ్చే అవకాశమున్నది. నల్లగొండ పార్లమెంట్ స్థానం నుంచి బరిలో నిలిచిన సైదిరెడ్డి అభ్యర్థిత్వాన్ని ఆ జిల్లా క్యాడర్ అంగీకరించే పరిస్థితి లేదు. రాష్ట్ర నాయకత్వంలోని కొందరు కీలక నేతలు కూడా ఆయన అభ్యర్థిత్వాన్ని నేటికీ బలంగా వ్యతిరేకిస్తున్నారనే ప్రచారమున్నది. ఆర్థిక హంగూ ఆర్భాటాలున్న తేరా చిన్నపురెడ్డిని గానీ, నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో బలమైన ఓటు బ్యాంకు ఉన్న బీసీ సామాజికవర్గానికి చెందిన రామరాజు యాదవ్‌ను గానీ బరిలో దింపాలనే ఒత్తిడి రాష్ట్ర నాయకత్వంపై ఉన్నది. ఈ డైలమాలు ఇలా కొనసాగుతున్నాయి.

**మూడు ప్రధాన పార్టీలలో ఒక్క కేసీఆర్ మాత్రమే తొట్రుపాటు లేకుండా రాజకీయాలు చేస్తున్నారు. ఆయన అందరి కంటే ముందున్నారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజం. గెలిచినప్పుడు అపర చాణక్యుడంటారు.. ఓడిపోతే ఇదేం వ్యూహం అంటారు. అందుకే... ఫలితాలతో సంబంధం లేకుండా చూస్తే కేసీఆర్ చాలా వేగంగా ఉన్నట్లే లెక్క.**

---




## బీజేపీకి బలమే లేదు!

*బీజేపీ నాయకులు చెప్తున్నట్టు ఆ పార్టీ ఏమంత బలంగా లేదు. సోషల్‌మీడియాలో మాత్రమే బీజేపీ బలంగా ఉంటుంది. నగరాల్లో మోదీని ప్రజలు గుర్తుపడతారేమో. కానీ, మౌలికస్థాయిలో గ్రామీణ ప్రాంతాల్లో ఆ పార్టీకి బలమే లేదు. బీజేపీకి ప్రజలెవరూ మద్దతివ్వరు.*



- విజయ్ ప్రభాకరన్, డీఎండీకే (తమిళనాడు) ఎంపీ అభ్యర్థి